

# సెలెక్షన్


పొడుగు వెంకటేశ్వరరావు

కృష్ణమూర్తిగారికి ఇద్దరే అమ్మాయిలు.

పెద్దది పద్మ. అంతా తల్లి పోలిక. ఎర్రటి శరీరచ్ఛాయ. అందమయిన విగ్రహం. ఎదటివాళ్ళని ఇట్టే ఆకర్షిస్తుంది పద్మ అందం. పైగా పద్మ సంగీతం నేర్చుకున్నది. ఆమె గొంతు విప్పితే చాలు; కోకిలలు సిగ్గుపడతాయి. పెళ్ళికి ఎదిగివచ్చిన, ఇన్ని మంచి లక్షణాలున్న పైడిబొమ్మ పద్మ. పైగా పోయినేడే బి. ఏ. ఫస్టు క్లాసు (!) లో పాసయింది - పరుగులు తీసే పందెపు గుర్రంలాగ పెళ్ళికి సిద్ధమయి కూర్చుంది, ఉత్సాహానికి మారుపేరైన పద్మ ఇపుడు.

రెండోది రాగిణి. రాగిణిని గూర్చి అంతగా చెప్పుకోదగింది ఏంలేదు. చామనఛాయ. పెద్ద పెద్ద తెలికన్నులూ—అందమయిన ప్రవర్తనా—ఇవే ఆమె ఎసెట్స్. మనిషి నిదానస్తురాలు. ఆలోచన వుంది. రాగిణిని పద్మతో పోలిస్తే వెలవెలపోతుంది గాని విడిగా చూస్తే ఓ మాదిరి అందగత్తె అని చెప్పవచ్చును.

కృష్ణమూర్తిగారికి పద్మని గురించి ఏం బెంగలేదు. పద్మ అందంచూసి




ఎవరయినా ముందుకి వస్తారు. అలాగే ఆనందరావూ రాడని లేదు. ఆనందరావు సీతమ్మ కొడుకు. సీతమ్మ చాన్నాళ్ళ క్రితమే భర్త పోగా కొడుకుని దగ్గరుండి చదివించుకుంది. ఆనందరావు ఎం. ఏ. పాసయి ఇపుడు మంచి ఉద్యోగమే చేస్తున్నాడు. ముందు ముందు బాగా పైకి పోగల అవకాశాలూ బాగా వున్నాయి. సీతమ్మ కృష్ణమూర్తికి తోబుట్టువు. పైగా ఆనందరావు అందగాడు కూడా. అందువల్లనే కృష్ణమూర్తి దృష్టి మేనల్లుడి మీద పడింది.

ఆ మధ్య గుంటూరు వచ్చినపుడు సీతమ్మతో ఆ విషయమే కదలేసాడు కృష్ణమూర్తి.

సీతమ్మ నవ్వి అంది, "నాదేముంది? అంతా వాడిష్టం." సీతమ్మ సమాధానంలో ఏదో కుత్సితం వుందనిపించి, కృష్ణమూర్తికి పౌరుషం వచ్చింది. "కట్నం ఎంత కావాలన్నా సిద్ధమే. నీ ఇష్టం" అన్నాడు రోషంగా. ఆ ధోరణికి సీతమ్మ మనసు కష్టపెట్టుకుని అంది. "ఇంతేనా నువ్వు నన్నర్థంచేసుకున్నది ? అన్నయ్యా. నాకుగాని వాడికి గాని కట్నకానుకలమీద మోజులేదు. అబ్బాయికి ఇష్టమవాలి. అంతే" అని నొక్కి చెప్పింది – వెంటనే అందుకున్నాడు. "అయితే సరే, ఎప్పుడొస్తారు బెజవాడ ?" అన్నాడు, కృష్ణమూర్తి లౌకికంగా.

"ఈ మధ్య వాడికి పని ఒత్తిడి ఎక్కువయింది. కనుక మేం రావటం కుదరదు. పరీక్ష లవగానే పిల్లలిద్దర్నీ తీసుకు రారాదూ, నువ్వే! వాళ్ళు ఇక్కడ నాల్గురోజులు వున్నట్టూ వుంటుంది. పెళ్ళిచూపుల తతంగంతో పిల్లల్ని బెదరగొట్టటమూ తప్పుతుంది. కేవలం చుట్టపు చూపని చెప్పి తీసుకురా అన్నయ్యా'' అంది సీతమ్మ.

కృష్ణమూర్తినవ్వి''అలాగే,మా పెద్దది పద్మ నీకు తెలుసుగా, చిదిమి దీపంపెట్టు కోవచ్చు. ఆనందానికి ఆ పిల్లని ఇవ్వాలని సంకల్పం. ఇక రెండోదాని గురించి ఓ ఏడాది తర్వాత గదా" అన్నాడు నవ్వి.

సీతమ్మసాలోచనగాఅంది.''అవును, నాకూ అలాగే అన్పిస్తోంది. పెద్దది తప్పకుండావాడికినచ్చుతుందని నావిశ్వాసం''

రాగిణిఇంటర్ పరీక్షలురాసాక ఇద్దరు కూతుళ్ళనీ వెంటపెట్టుకుని వస్తున్నానని ఉత్తరం రాసాడు కృష్ణమూర్తి. అప్పుడే ఆనందరావుకి ఆ విషయం చెప్పింది సీతమ్మ.

ఆనందరావు నవ్వాడు.

"అయితే నన్ను ఇబ్బందిలో పెట్టున్నావన్నమాట" అన్నాడు.

"తప్పదు మరి, ఈ ఇంటికి కోడలు రావాలని ఎన్నాళ్ళుగానో కలలు కంటున్నాను.నా కోరిక తీర్చవలసిన బాధ్యత నీమీద వుంది", అంది సీతమ్మ.

"సరే, నీ ఇష్టం" అన్నాడు, ఆనందరావు బుద్ధిమంతనంగా.

"స్టేషనుకి వెళ్ళి వాళ్ళని తీసుకునిరా. మర్యాదగా వుండాలి గదా" అని కొడుక్కి హితవు చెప్పింది సీతమ్మ.

"అలాగే" అని—

అలాగే కృష్ణమూర్తినీ, అతని ఇద్దరి కూతుళ్ళనూ రిసీవు చేసుకున్నాడు ఆనందరావు. ఆ రోజు బాగా వర్షం పడింది. నేలంతా బురద బురద అయింది. అందుకని వాకిట్లోనే బిందెడు నీళ్ళు, చెంబూ పెట్టింది సీతమ్మ. కృష్ణమూర్తి కాళ్ళు కడుక్కుని సీతమ్మతో కబుర్లు చెప్పాడు. ఓ చెంబుడు నీళ్ళతో తానూ కాళ్ళు కడుక్కుని తుడుచుకుంది రాగిణి. అంతవరకు ఆనందరావుతో కబుర్లు చెప్తున్న పద్మ మిగిలిన నీళ్ళన్నీ ఖాళీచేసి "అత్తయ్యోయి,నీళ్ళు" అంది. సీతమ్మ నవ్వుకుని మరో బిందెడు నీళ్ల తెచ్చింది. అవీ అయితేగాని పద్మ కాళ్ల కడగటం పూర్తవలేదు; అది ఆనందరావూ గమనించాడు.

ఆ రెండురోజులూ రాగిణి ఇంటి పనుల్లో సీతమ్మకి సాయంచేసింది. ఆనందరావుని తప్పుకుని తిరిగింది. పద్మ ఆనందరావుని వదలలేదు. గలగల కబుర్లు చెప్పింది. ఎన్నో విషయాలు చర్చించింది. పాటలు పాడి



యున

అతనికి ఆహ్లాదం కలిగించింది. పద్మా, ఆనందరావూ అలాగ పాలూ, నీళ్ళూ లాగ కలిసిపోవటం కృష్ణమూర్తికి ఆనందాన్నీ, సీతమ్మకి సంతృప్తినీ కలిగించాయి.

వాళ్ళగురించే ఆనందరావు రెండు రోజులు సెలవుపెట్టాడు.

ఆ మూడోనాడు ఆనందరావు తల్లికి చెప్పాడు, "నేను రేపే వైజాగు టూరు మీద వెళ్తున్నాను, అర్జంటు పని." అని

"మంచిది, మామయ్యా కూడా వెళ్ళిపోవాలంటున్నాడు. ఈ వేసవిలోనే పెళ్ళి అవాలని తొందరపెట్టున్నాడు. నీ నిర్ణయం చెప్పు మరి. ఏర్పాట్లు చేసుకోవటానికి వాళ్ళకి టైము కావాలిగదా", అంది సీతమ్మ.

"తప్పదా ?"

"తప్పదు మరి."

"సరే, రాగిణిని నీ కోడలుగా సెలక్టు చేసాను. ఆ సంగతే మామయ్యతో చెప్పు."

సీతమ్మ తెల్లబోయింది, "అదేమిట్రా ? బంగారు బొమ్మ పద్మని కాదని ..." ఆనందరావు నవ్వి అన్నాడు "పద్మ బంగారు బొమ్మ అన్న మాట నిజమేనమ్మా, కాని రాగిణి అందాల బొమ్మ అని నా కన్పించింది. కనపడని రాగిణి అందాలు నాకు ఆమె ప్రవర్తనలో కన్పించాయి. నెమ్మది, అణకువ, పొదుపు – ఇవే నేను ఈ ఇంటి కోడలికి కావాలని కోరుకున్నవి." సీతమ్మ కాదనలేక ఆలోచనలో పడింది.

ఆనందరావు వైజాగు వెళ్ళిపోగానే ఈ సంగతి కృష్ణమూర్తి చెవిన వేసింది సీతమ్మ.

కృష్ణమూర్తి తెల్లబోయి "అలాగా" అన్నాడు. ఆశ్చర్యాన్ని అణచుకోలేక పోయాడు.

ఇంకా–పద్మ అందమయిన కలలు కంటూనే వుంది. ఈ ఊరు వచ్చాక "ఆ" కలలకి నాయకుడు ఆనందరావే అయాడు. రాగిణి అయితే కలల జోలికి పోలేదు. కాని సమీప భవిష్యత్తులో ఆ కలలే ఆమెకోసం కాచుకుని వున్నాయి. ఆనందరావు సెలక్షన్ సంగతి ఆ ఇద్దరికీ ఇంకా తెలీదు !

